కేజ్రీవాల్‌పై బిజెపి కుట్ర

- ఆప్ నేత సంజయ్ సింగ్

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణంలో ఇరికించేం దుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాయకులు కుట్రకు తెరలేపారని ఆప్ నాయకులు సంజయ్ సింగ్ శుక్రవారం ఆరోపించారు. ప్రస్తుతం సంజయ్ సింగ్ జైలులో ఉన్నారు. ఎక్సైజ్ పాలసీ కేసులో అరెస్టు చేసిన సంజయ్ సింగ్‌ను ఢిల్లీలోని రోజ్ అవెన్యూ కోర్టులో శుక్రవారం పోలీసులు హాజరు పరిచారు. అనంతరం సంజయ్ సింగ్ విలేకరులతో మాట్లాడారు. 'కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు భారీ కుట్ర జరుగుతోంది.. కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడమే కాకుండా ఆయనకు హాని తలపెట్టేందుకు బిజెపి నాయకులు పెద్ద స్కెచ్ వేస్తున్నారు' అని సంజయ్ సింగ్ పేర్కొన్నారు. మద్యం స్కామ్‌కు సంబంధించి గత నెలలో సంజయ్ సింగ్‌ను ఆయన నివాసంలో ఇడి సుదీర్ఘంగా ప్రశ్నించిన అనంతరం అదుపులోకి తీసుకుంది. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి మనీల్యాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు కేజ్రీవాల్‌కు ఇడి ఇటీవల సమన్లు జారీ చేసిన నేపథ్యంలో సంజయ్‌సింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకు న్నాయి. కేంద్రంలోని అధికార బిజెపి కనుసన్నల్లోనే ఇడి తనకు సమన్లు జారీ చేసిందని కేజ్రీవాల్ కూడా ఆరోపించారు. ఇదే కేసులో ఢిల్లీ మంత్రి మనీష్ సిసోడియా జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ

- న్యూయార్క్ టైమ్స్ హెడ్‌క్వార్టర్స్ వద్ద మీడియా సిబ్బంది ధర్నా

న్యూయార్క్ : గాజాలో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని కోరుతూ న్యూయార్క్ టైమ్స్ ప్రధాన కార్యాలయం వద్ద మీడియా సిబ్బంది గురువారం ధర్నా నిర్వహించారు. హమస్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న సైనిక చర్యల కవరేజీ పట్ల మీడియాలో ఒక వర్గం పక్షపాతం వహిస్తోందంటూ వారు ఆరోపించారు. మాన్‌హటన్ హెడ్‌క్వార్టర్స్ వెలుపల జరిగిన ధర్నాలో వందలాదిమంది పాల్గొన్నారు. గాజాలో మరణించిన వేలాదిమంది పాలస్తీనియన్ల పేర్లను ప్రదర్శకులు చదివి వినిపించారు. యుద్ధం ఆరంభమైనప్పటి నుండి కనీసం 36మంది జర్నలిస్టులు మరణించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో కాల్పుల విరమణకు బహిరంగంగా మద్దతు ప్రకటించాలంటూ టైమ్స్ ఎడిటోరియల్ బోర్డును వారు కోరారు. విచక్షణారహితంగా జరుగుతున్న మారణకాండలో ఒక పక్షం మీడియా కూడా కుమ్మక్కవుతోందని విమర్శించారు. న్యూయార్క్‌లో పలు చోట్ల పాలస్తీనియన్లకు మద్దతుగా జరిగిన కార్యాచరణలో భాగంగా ఈ ధర్నా జరిగింది. జూయిస్ వాయిస్ ఫర్ పీస్ గ్రూపు కార్యకర్తలు మంగళవారం స్టాట్యూ ఆఫ్ లిబర్టీని ఎక్కారు. కాల్పుల విరమణ తక్షణమే జరగాలని డిమాండ్ చేస్తూ గ్రాండ్ సెంట్రల్ టెర్మినల్‌లో కమ్యూటింగ్ కేంద్రాన్ని మూసివేశారు.

ఆకలి కేకలు ఒప్పుకున్న మోడీ



- అందుకే ఐదేళ్ల ఉచిత రేషన్ హామీ • పెరిగిన నిరుద్యోగం • అట్టడుగున ఆర్థికాభివృద్ధి •అయినా ఓటర్లపై 'గ్యారంటీ'ల వర్షం

న్యూఢిల్లీ : దేశంలోని 80 కోట్ల మంది పేదలకు మరో ఐదు సంవత్సరాల పాటు ఉచితంగా ఆహార ధాన్యాలు సరఫరా చేస్తామని ప్రధాని మోడీ ఛత్తీస్‌గఢ్‌లో ప్రకటించారు. ఇది మోడీ ఇస్తున్న గ్యారంటీ అంటూ గొప్పలు పోయారు. భారత్‌ను ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేస్తానని మోడీ మరో గ్యారంటీ ఇచ్చారు. అయితే ఇక్కడ మోడీ ఓ విషయాన్ని దాస్తున్నారు. అదేమంటే దేశం ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తూ, 2028 నాటికి మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన పక్షంలో 80 కోట్ల మందికి ఉచితంగా ఆహారాన్ని అందించాల్సిన అవసరం ఏముందన్నది మాత్రం ఆయన చెప్పడం లేదు. దేశం అత్యంత వేగంగా అభవృద్ధి చెందుతూ అమృతకాలంలో ప్రవేశిస్తుంటే మరో ఐదు సంవత్సరాల పాటు ఉచిత రేషన్ ఇవ్వాల్సిన అవసరం ఏముందన్నదే ఇక్కడ ప్రశ్న. 2023వ సంవత్సరపు ప్రపంచ ఆకలి సూచికలో మన దేశం నాలుగు స్థానాలు దిగజారి మొత్తం 125 దేశాల్లో 111వ స్థానంలో నిలిచింది. ఈ సూచికను మోడీ ప్రభుత్వం తోసిపుచ్చింది. అయితే మరో విధంగా దానిని అంగీకరించింది. అందుకే ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ యోజన పథకం కింద ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగించింది.

దాంబికాల ప్రచారం

శాసనసభ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మోడీ హామీలు గుప్పిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానిగా మోడీ పాలన సుమారు పది సంవత్సరాల పాటు కొనసాగింది. అభివృద్ధి, ఉపాధి, పొదుపు రేటు, ప్రైవేటు పెట్టుబడులు, విదేశీ పెట్టుబడులు, ఎగుమతులు వంటి విషయాలలో మంచి ఫలితాలు రాబట్టడానికి ఈ పది సంవత్సరాల సమయం చాలా ఎక్కువే. అయితే ఈ అంశాల్లో వాస్తవ ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. ప్రభుత్వ పనితీరు పేలవంగా ఉంది. అయినప్పటికీ మోడీ, ఆయన అనుచర గణం మాత్రం మీడియాలోనూ, ఇతర సామాజిక మాధ్యమాలలోనూ దేశం ఆశ్చర్యకరమైన పురోభివృద్ధి సాధించిందని డాంబికాలు పలుకుతున్నారు. గడచిన పది సంవత్సరాల్లో మోడీ అధిక జీడీపీ వృద్ధి రేటుకు గ్యారంటీ ఇవ్వలేదు. గత తొమ్మిదేళ్లుగా ఈ రేటు 5.7%గానే ఉంటోంది. 2014లో హామీ ఇచ్చిన విధంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నెరవేర్చడంలో మోడీ దారుణంగా విఫలమయ్యారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడంలోనూ వైఫల్యమే. గత పదేళ్లలో వ్యవసాయ ఉత్పత్తులకు అయ్యే వ్యయాన్ని కనీస మద్దతు ధరల పెంపుతో పోలిస్తే ఈ విషయం బోధపడుతుంది. ఈ హామీలను నెరవేర్చలేని మోడీ ఇప్పుడు మరో ఐదేళ్ల వరకూ ఉచిత ఆహార ధాన్యాలు అందిస్తానని గ్యారంటీ ఇస్తున్నారు.

కార్మిక సర్వే చెప్పిన చేదు నిజాలు

ఆర్థిక రంగంలో మోడీ ప్రభుత్వ పనితీరు ఎంత దారుణంగా ఉన్నదో గణాంకాల శాఖ గత నెలలో విడుదల చేసిన కార్మిక సర్వే బయటపెట్టింది. 2022-23 జూలై నెలల మధ్య కాలానికి సంబంధించి ఈ సర్వే ఏం చెప్పిందంటే దేశంలో ఉద్యోగాలు, ఉపాధి పొందిన 500 మిలియన్ల మందిలో 58శాతం మంది స్వయం ఉపాధి పొందిన వారే. స్వయం ఉపాధి పొందిన వారిలో ఎక్కువ మంది చిన్న చిన్న వ్యాపారులు, స్వయంగా సేవలు అందించే వారు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీరి సంఖ్య అధికంగా ఉంది. 2017-18లో ఉద్యోగాలు, ఉపాధి పొందిన వారిలో వీరి సంఖ్య కేవలం 52శాతం. అంటే ఇటీవల స్వయం ఉపాధి పొందిన వారి సంఖ్య పెరిగిందన్న మాట. ఉత్పాదకేతర రంగంలో తక్కువ నాణ్యత కలిగిన ఉద్యోగాల్లో పెరుగుదలను ఇది సూచిస్తోంది. ఎందుకంటే స్వయం ఉపాధి పొందిన వారిలో మూడో వంతు మంది వేతనాలు లేకుండా పని చేస్తున్నారు. చిన్న కుటుంబాలు నడిపే వ్యాపారాల్లో వీరు ఎలాంటి వేతనం తీసుకోకుండా పని చేస్తుంటారు. స్వయం ఉపాధి పొందిన వారు, వారిలో వేతనాలు తీసుకోకుండా పని చేస్తున్న వారి మధ్య దామాషా గడచిన ఐదేళ్లలో బాగా పెరిగింది. ముఖ్యంగా పెద్ద నోట్ల రద్దు, కోవిడ్ ప్రభావం తర్వాత ఈ పరిస్థితి కన్పించింది.

తగ్గిన వేతనాలు

స్వయం ఉపాధి పొందిన వారిలో వేతనాలు లేకుండా పని చేస్తున్న వారు 2017-18లో నాలుగు కోట్ల మంది ఉంటే ఆ సంఖ్య గత సంవత్సరం నాటికి తొమ్మిదిన్నర కోట్లకు పెరిగిందని ఆర్థికవేత్త సంతోష్ మెహ్రోత్రా తెలిపారు. వీరిని ఉద్యోగులుగా గుర్తించలేమని ఆయన చెప్పారు. 2017-18తో పోలిస్తే 2022-23లో నెలవారీ సగటు వేతనాలు 20శాతం తగ్గాయని కార్మిక సర్వే తెలిపింది.

విస్తృత వ్యూహాత్మక భాగస్వామ్యమే లక్ష్యం !

- భారత్, అమెరికా విదేశీ, రక్షణ మంత్రుల భేటీ
- కెనడాలో ఖలిస్తానీ శక్తుల కార్యకలాపాలపై ఆందోళన

న్యూఢిల్లీ : వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకునేందుకై భారత్, అమెరికా విదేశీ, రక్షణ మంత్రులు శుక్రవారం ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఇండో-పసిఫిక్ అంశాలు, ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ళు చర్చకు వచ్చాయి. రక్షణ పారిశ్రామిక సంబంధాలను మరింతగా విస్తరించుకోవాలని భావిస్తున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కార్యకలాపాలను పెంచాలని, కీలకమైన ఖనిజాలు, అత్యున్నత సాంకేతికత వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఆకాంక్షించారు. భారత తరుపున విదేశాంగ మంత్రి జై శంకర్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లు పాల్గొనగా, అమెరికా తరపున ఆంటోనీ బ్లింకెన్, లాయిడ్ ఆస్టిన్‌లు పాల్గొన్నారు. ముందస్తు దృక్పథం గల భాగస్వామ్యాన్ని నిర్మించి, అంతర్జాతీయ ఎజెండాను రూపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ల దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు ఈ చర్చలు ఒక అవకాశాన్ని కల్పిస్తాయని సమావేశం ప్రారంభానికి ముందు జై శంకర్ వ్యాఖ్యానించారు. కీలకమైన సాంకేతికతలు, ముఖ్యమైన ఖనిజాల రంగంలో, పౌర రోదసీ రంగంలో సహకారం వంటి కొత్త రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారానికి గల అవకాశాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. రక్షణ సహకారాన్ని మరింత పెంచుకోవడానికి ఇరు దేశాలు ఆసక్తిగా వున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు అత్యంత కీలకమైన మూల స్తంభాల్లో రక్షణ సహకారం ఒకటిగా వుందన్నారు. అమెరికాతో అన్ని రంగాల్లో కలిసి సన్నిహితంగా పనిచేయడానికి ఎదురుచూస్తున్నామని చెప్పారు.క్వాడ్ ద్వారా అమెరికా-భారత్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటూ స్వేచ్ఛా, పారదర్శకమైన, సుసంపన్నమైన, భద్రత కలిగిన ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని పెంచి పోషించడానికి ఇరు పక్షాలు కృషి చేస్తున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చెప్పారు. నిబంధనల ఆధారిత వ్యవస్థను పెంపొందించేందుకు కృషి చేస్తూ, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, స్వాతంత్ర్య సూత్రాలను పరిరక్షిస్తూ, అంతర్జాతీయ శాంతి, భద్రతా రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచి పోషించడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

తెలంగాణలో ముగిసిన నామినేషన్ల పర్వం

- అత్యధికంగా గజ్వేల్‌లోనే...
- బరిలో బిజెపి మినహా అన్ని పార్టీల అధినేతలు
- రాత్రి 7 గంటల తర్వాతా నామినేషన్ల స్వీకరణ

హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. పలుచోట్ల పార్టీ కార్యకర్తల మధ్య కొట్లాటలు, పోలీసుల లాఠీచార్జీలతో ఉద్రిక్తతలు నెలకొన్నా, మొత్తానికి ప్రశాంతంగా తొలి దశ ఘట్టం పూర్తయ్యింది. ఈనెల 13వ తేదీ వరకు నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. 15వ తేదీలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల దాఖలుకు చివరి గడువు కావడంతో అన్ని నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. మధ్యాహ్నం 3 గంటల లోపు రిటర్నింగ్ కార్యాలయాల ఆవరణలో ఉన్న అభ్యర్థులందరి నామినేషన్లను స్వీకరించారు. దీనితో కొన్ని నియోజకవర్గాల్లో రాత్రి 7 గంటల తర్వాత కూడా నామినేషన్ల స్వీకరణ జరుగుతూనే ఉంది. దీనికి సంబంధించిన తుది సమాచారం రావడానికి మరింత సమయం పడుతుందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ రాత్రి పది గంటల సమయంలో మీడియాకు తెలిపారు.

గజ్వేల్‌లోనే అత్యధికం...

ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. 'ధరణి' వల్ల నష్టపోయిన ఇక్కడి రైతులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు కేసీఆర్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. గురువారంనాటికే ఇక్కడ 43 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం మరికొందరు ఇదే కారణంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. .

ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ మినహా అన్నిపార్టీల అధినేతలు పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ గజ్వేల్, కామారెడ్డి నుంచి పోటీచేస్తుండగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో పాటు కామారెడ్డి నుంచీ పోటీచేస్తున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచీ పోటీచేస్తున్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సిర్పూర్ స్థానం నుంచి బరిలో ఉన్నారు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెనకడుగు వేశారు. ఆయన స్వంత నియోజకవర్గం అంబర్‌పేట నుంచి మాజీ మంత్రి, నకిలీ స్టాంప్‌పేపర్ల కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించి వచ్చిన సీ కృష్ణయాదవ్‌ను బరిలో నిలిపారు.

రాజస్థాన్‌లో సోదాలు

- లక్షల్లో నోట్ల కట్టలు

జైపూర్: ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన లాకర్లలో ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించి, లక్షల్లో డబ్బులు కనుగొన్నారు. మరో లాకర్‌లో భారీ సంఖ్యలో నోట్ల కట్టలతో ఉన్న సంచిని గుర్తించారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. టీచర్ రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్ ద్వారా సంపాదించిన అక్రమ ధనాన్ని జైపూర్‌లోని గణపతి ప్లాజాలోని ప్రైవేట్ లాకర్లలో ఉంచారని బిజెపి ఎంపి కిరోరీ లాల్ మీనా గత నెలలో ఆరోపించారు. ఈ నేపథ్యంలో గణపతి ప్లాజాలో ఉన్న సుమారు 1,100 లాకర్లపై ఐటీ అధికారులు శుక్రవారం సోదాలు జరిపారు. గత నెల 17న మూడు లాకర్ల నుంచి సుమారు రూ.30 లక్షలు, గత నెల 21న మరికొన్ని లాకర్ల నుంచి రూ.2.46 కోట్ల నగదును ఐటి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.గతేడాది డిసెంబర్‌లో గ్రేడ్ 2 టీచర్ రిక్రూట్‌మెంట్ పేపర్ లీక్ అయ్యింది. దీంతో ఆ పరీక్షను రాజస్థాన్ ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పేపర్ లీక్ కేసుకు సంబంధించి 37 మంది అభ్యర్థులు సహా 55 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.60 లక్షలకు పేపర్‌ను లీక్ చేసినట్లు విచారణలో రాజస్థాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు బాబులాల్ కటారా అంగీకరించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది.

కేరళ సుపంపన్నమైన భవిష్యత్తుకై 22 ప్రాధాన్యతా రంగాల గుర్తింపు

- ముఖ్యమంత్రి విజయన్ వెల్లడి

కోచి : కేరళ రాష్ట్రానికి సుస్థిరమైన, సుసంపన్నమైన భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం 22 ప్రాధాన్యతా రంగాలను గుర్తించిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం తెలిపారు. కేరళకు గల అభివృద్ధి అవకాశాలపై చర్చించేందుకు కేరళ పారిశ్రామిక సహకార సంస్థతో కలిసి ఫిక్కి ఏర్పాటు చేసిన రెండు రోజుల సమావేశం రెండవ రోజు ప్రతినిధులను ఉద్దేశించి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగించారు. పెట్టుబడులను ఆకర్షించి, ఆర్థికాభివృద్ధిని పెంపొందించేందుకు సానుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాల్సిన ప్రాముఖ్యతను గుర్తిస్తూ, అనేక చొరవలను తాము తీసుకున్నామని అవే ఈనాడు కేరళను వ్యాపారాల ఆవిష్కరణకు, అభివృద్ధికి కేంద్రంగా నిలబెట్టాయని విజయన్ చెప్పారు. 'ఇందుకు సంబంధించి మన కీలకమైన లక్ష్యాల్లో ఒకటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ కె-స్విఫ్ట్ (సింగిల్ విండో క్లియరెన్స్ మెకానిజం)ను ప్రవేశపెట్టడం. ఈ వినూత్నమైన వేదిక వివిధ విభాగాలను, సంస్థలను సమన్వయం చేసి, వివిధ ప్రక్రియలను వేగవంతం చేస్తుంది, ఇన్వెస్టర్లకు అనవసరమైన పాలనా యంత్రాంగ అడ్డంకులను తొలగిస్తుంది. ప్రస్తుతం, కేరళ రాష్ట్రం మరింత సులభంగా వ్యాపారం చేసుకోవడాన్ని పెంపొందించడం కోసం జాతీయ ఏక గవాక్ష వ్యవస్థతో కె-స్విఫ్ట్‌ను సమ్మిళితం చేసే దిశగా మేం పనిచేస్తున్నాం" అని విజయన్ పేర్కొన్నారు. సులభంగా వ్యాపారం చేసుకోవడానికి, పారదర్శకత, జవాబుదారీతనానికి హామీ కల్పించడానికి కె-స్విఫ్ట్‌కు సంబంధించి గణనీయమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. కేరళ కేంద్ర తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా మాన్యువల్‌గా జరిగే వాటిని మార్చామని, దీనివల్ల జరగాల్సిన క్రమం మరింత క్రమబద్ధీకరణ అవడమే గాకుండా పారదర్శకత పెరుగుతుందని, అవినీతికి తావు లేకుండా వుంటుందని విజయన్ చెప్పారు.

బిజెపితో 3 ప్రాంతీయ పార్టీల మ్యాచ్ ఫిక్సింగ్

(మొదటిపేజీ తరువాయి)

బిజెపితో కలిస్తే ప్రజలకు న్యాయం చేయలేరని అన్నారు.

మరోవైపు రాష్ట్రంలో సాధికారత పేరుతో వైసిపి చేస్తున్న యాత్ర నేతిబీరకాయ లాంటిదని, అందులో నెయ్యి ఎంత ఉంటుందో వీరి యాత్రలోనూ అంతే సాధికారత ఉంటుందని విమర్శించారు. ఏజెన్సీలో పోడు భూములపై గిరిజనులకు హక్కు పత్రాలు ఇచ్చారని, అక్కడ నుండి కూడా వెళ్లగొడుతున్నారని తెలిపారు. ఈ భూములను పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి పేరుతో అదానీకి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గ్రామసభలు జరపకుండా అంగుళం కూడా ఇవ్వబోమని గిరిజనులు తెగేసి చెబుతున్నారని అన్నారు. ఆర్థిక సాధికారత కల్పించకుండా కార్పొరేషన్ పదవులు ఇస్తే వారు కార్లలో తిరగడం తప్ప ప్రజలకు జరిగే న్యాయం ఏమిటో చెప్పాలన్నారు. ఎన్నికలు దగ్గరకు వచ్చే కొద్దీ వైసిపి వాళ్లు సామాజిక సాధికార యాత్ర పేరుతో హడావుడి చేస్తూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలను ఉద్ధరిస్తామని చెబుతున్నారని కానీ కార్యక్రమంలో గానీ, చేసిన పనుల్లో సామాజిక న్యాయం లేదని విమర్శించారు. ఇప్పటికీ గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికలు లేవని తెలిపారు. 1235 జిఓను అమలు చేయకుండా సామాజిక సాధికారత గురించి మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. భూమిలేక పేదలు ఎక్కువ మంది కూలి పనులకు వెళ్లిపోతున్నారని, అటువంటి వారందరిలో ఎక్కువమంది దళిత, గిరిజన, మైనార్టీ, వెనుకబడిన తరగతుల వారే ఉన్నారని, వారికి భూమిపై హక్కు కావాలని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వకుండా, ఉపాధి లేకుండా సాధికారత ఎక్కడ నుండి వస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికీ హమాలీలు, అసంఘటితరంగ కార్మికులు కనీస వేతనంతో బతుకుతున్నారని, కనీస వేతనాలు అప్‌డేట్ చేయలేదని రూల్స్ ఫ్రేం చేయలేదని మండిపడ్డారు. ట్రైబల్ సబ్‌ప్లాను, దళిత సబ్‌ప్లాను అమలు చేయలేదని, దళితులు, గిరిజనులకు ప్రత్యేకంగా ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బడ్జెట్లో కేటాయించిన నిధులు మళ్ళించారని, చట్ట ప్రకారం దళిత, గిరిజన ప్రాంతాల్లో నిధులు ఖర్చు చేయకుండా, అభివృద్ధి ఎలా చేస్తారని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో సామాజిక సంహారం జరుగుతోంది తప్ప సాధికారత లేదని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళలు, వివిధ రూపాల్లో వెనుకబడిన సామాజిక తరగతులను కేంద్రం అడ్డగోలుగా అణచివేస్తుంటే వైసిపి ప్రభుత్వం కేంద్రానికి ఎలా మద్దతు ఇస్తుందని ప్రశ్నించారు.

ప్రజల ఎజెండాను హైజాక్ చేస్తున్నారు

ప్రజా సమస్యలు పట్టించుకోకపోగా పాలక వర్గ పార్టీలు అసలు ఎజెండాను పక్కదారి పట్టించి ప్రజల అజెండాను హైజాక్ చేస్తున్నారని, దాన్ని ముందుకు తీసుకొచ్చి ప్రజా ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్లి పోరాటాలు నిర్వహించేందుకే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సాగిన ప్రజారక్షణ భేరి బస్ యాత్రలు 12 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 250 మండలాల్లో 120 నియోజకవర్గాల్లో 3,500 కిలోమీటర్లు ప్రయాణించాయని తెలిపారు. రాష్ట్రంలో వేర్వేరు భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక సామాజిక పరిస్థితులున్న ప్రాంతాల్లో పర్యటించామని అన్నారు. 150కిపైగా సభలు నిర్వహించామని, లక్షమందికిపైగా ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. బిజెపిపై యువతలో తీవ్ర ఆగ్రహం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపైనా తీవ్ర అసంతృప్తి ఉందని, ఇది ఏ రూపం తీసుకుంటుందనేది భవిష్యత్‌లో తెలుస్తుందని అన్నారు. ప్రజలపై అనేక భారాలు పడ్డాయని, కరెంటు ఛార్జీల భారాన్ని ప్రజలు ప్రతిచోటా నిరశిస్తున్నారని తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలి

రాష్ట్ర వ్యాప్తంగా 300 మండలాల్లో కరువు ఉందని, మంచినీరు లేదని, ఉపాధి లేదని అన్నారు. చాలాచోట్ల ఇప్పటికే పనులు నిలిపేశారని పేర్కొన్నారు. ఇంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొని ప్రజలు అలమటిస్తుంటే కరువే లేదని సిఎం ప్రకటన చేయడం హాస్యాస్పదమని అన్నారు. వర్షాభావంతోపాటు కృష్ణా డెల్టాలోనూ పంటలు ఎండిపోతున్నాయని, నదుల్లో నిల్వలు తగ్గిపోతున్నాయని తెలిపారు. విజయవాడ సమీపంలో ఉన్న పెనమలూరు మండలంలోనే పంటలు ఎండిపోతున్నాయని, అవనిగడ్డ లాంటి మండలాల్లో పరిస్థితి చెప్పనలవి లేకుండా ఉందని తెలిపారు. అయినా దీనిపై పరిశీలనకు కేంద్ర బృందం రాలేదన్నారు. కరువు గుర్తింపు, సహాయక చర్యలకు సంబంధించి మాన్యువల్ మార్చాలని కోరారు. పంటలు ఎండిపోయినా, కరువు, ఉపాధి, మంచినీరు లేకపోయినా కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరారు. అక్టోబరులో పంట ఎండిపోయిందని, రబీకి నీరు లేదని అన్నారు. 28 లక్షల ఎకరాల్లో పంటలు పండలేదని తెలిపారు. కేంద్రం రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, రాష్ట్రప్రభుత్వం గుడ్డిగా కళ్లుమూసుకుని అంతా సుభిక్షంగా ఉందని జపం చేస్తోందని ఆగ్రహించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిప్పుతో చెలగాటమా?

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ల సమస్య పంజాబ్ నుంచి తమిళనాడుకు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారికి విస్తరిస్తోన్న వ్యాధి అని, దీనిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని కోర్టుకు తెలిపారు. గవర్నర్ల ప్రవర్తన రాజ్యాంగ విరుద్ధమని, ఆయన చర్య ప్రభుత్వ పాలనపై ప్రభావం చూపుతుందని తెలిపారు. "దాదాపు రెండు మూడు సంవత్సరాల క్రితం తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ సంతకం చేయటం లేదు. రిమిషన్ ఆర్డర్‌లకు సంబంధించిన బిల్లుపై కూడా సంతకం చేయడం లేదు. ప్రాసిక్యూషన్ లేదా రిమిషన్ కోసం శాంక్షన్ ఇవ్వాలని మేము మిమ్మల్ని వేడుకుంటున్నాము అనే లేఖ ఇక్కడ ఉంది. జైలులో ప్రజలు ఉన్నారు. ఏదో ఒకటి చేయాలి" అని సింఘ్వీ అన్నారు. సింఘ్వీతో పాటు తమిళనాడు తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, పి. విల్సన్ కూడా హాజరయ్యారు. అనంతరం అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై పంజాబ్ గవర్నర్ బన్వరీలాల్ పురోహిత్ తీసుకున్న చర్యల వివరాలను తమకు అందజేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోర్టు ఆదేశించింది. తమిళనాడులో డిఎంకె ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్ఎన్ రవి మధ్య, పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వానికి గవర్నర్ పురోహిత్ మధ్య ఇటీవలి కాలంలో విభేదాలు తలెత్తాయి. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను ఆమోదించడంలో గవర్నర్లు ఉద్దేశపూర్వకంగా అలసత్వం ప్రదర్శిస్తున్నారని సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

పలు రాష్ట్రాల్లో గవర్నర్ల తీరుపై సుప్రీంకోర్టు ఈ నెల 6న ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. గవర్నర్లకు ఆత్మపరిశీలన అవసరమని వ్యాఖ్యానించింది.

కేరళ దాఖలు చేసిన పిటిషన్లను కూడా ఈ నెల 20న విచారించనుంది.

భారత ప్రభుత్వం
**సాంఘిక న్యాయం& సాధికారత మంత్రిత్